# అంతరంగయాత్ర

జె. కృష్ణమూర్తి బోధనలతో కూర్చిన ప్రచురణ

ANTHARANGA YATRA

KRISHNAMURTI FOUNDATION INDIA APRIL - JULY 2008 Rs.2/- VOL. II ISSUE 3



సత్యాన్ని అన్వేషించడమే మతం.
సత్యం ఏ దేశానికీ,
ఏ పద్ధతికీ చెందదు.
గుడిలో, మసీదులో, చర్చిలో కనబడదు.

# మన లోలోతుల్లో ఉన్న భయాలను తెలుసుకోగలమా?

మనకెన్నో జటిల సమస్యలు ఉన్నాయి. వాటిని పరిష్కరించడంకోసం దురదృష్టవశాత్తూ మయితరులమీద నిపుణులు-నిష్ణాతులమీద ఆధారపడతాము. వాటినుండి తప్పించుకోవడం కోసం ప్రపంచమంతటా వున్న మతాలు రకరకాల మార్గాలను అందించాయి. జటిలమయిన యీ మానవ సమస్యలను పరిష్కరించడంకోసం విజ్ఞాన శాస్త్రం తోడ్పడుతుందని, వాటిని విద్య పరిష్కరించి అంతమొందిస్తుందనీ తలచారు. అయితే, ప్రపంచమంతటా సమస్యలు పెరిగిపోతూవున్నట్లు, హెచ్చవుతూ ఎంతో మరెంతో ప్రమాదకరంగా అవుతూ, జటిలంగా, అంతులేకుండా ఉన్నట్లు కన్పిస్తున్నాయి. చివరికి మతాచార్యులమీదగానీ, శాస్త్రవేత్తలమీదగానీ, నిపుణులమీదగానీ ఎవరి మీదా మనిషి ఆధారపడలేడని గ్రహిస్తాడు. అవన్నీ వీగిపోవడంతో సమస్యలలోనికి తానే ఒంటరిగా వెళ్ళాలి. యుద్ధాలు, మతపర విభజనలు, మనిషికి మనిషికి మధ్య వైరి భావాలు, క్రూరతలు అన్నీ కొనసాగడంతో భయం, దుఃఖం నిరంతరం పెరిగిపోతూ ఉన్నాయి.

తనకు తానే అర్థం చేసుకోవడమనే ప్రయాణం చేయాలని తెలుస్తుంది. ఎవరి ఆధిపత్యమూ అక్కడ లేకపోవడమూ గోచరిస్తుంది. అన్ని రకాలయిన ఆధిక్యతా వీగిపోయింది (మరొకస్థాయిలో సాంకేతిక నిపుణుని అధికారమో, ఒక నిష్ణాతుని అధికారమో తప్ప) ఈ అధికారాలను ఒక మార్గదర్శకంగా స్వేచ్ఛాశాంతులను తీసుకొచ్చే మార్గాలుగా మనిషి నిలిపాడు. అవి వీగిపోవడంతో వాటి అర్థాన్ని కోల్పోయాయి. దానితో ఆధ్యాత్మిక, నైతిక అధికారాలకు వ్యతిరేకంగా ఉద్యమం వచ్చింది. ప్రతీదీ విచ్ఛిన్నమవుతున్నది. ఈ దేశానికి బహుశా 300 సంవత్సరాల వయసుండవచ్చు. ఇంత చిన్న వయసులో యింకా పరిపక్వమవకముందే క్షీణించడ మారంభమవడము చూడగలరు. అస్తవ్యస్థత, ఘర్షణ, గందరగోళం ఉన్నాయక్కడ. దానితో భయం, దుఃఖం ఉండక తప్పవు. బయట జరుగుతున్న యీ ఘటనలు తనకు తానుగా పరిష్కారం తెలుసుకునేట్లు తప్పక వత్తిడి చేస్తాయి. బయటినుండి ఏ అధికారమూ నమ్మకమూ, మతనియమమూ, నైతికస్థాయీ ఏదీ సహాయపడబోవడం లేదని తెలిసినమీదట పలకను పూర్తిగా తుడిచివేసి మళ్ళీ ప్రారంభించాలి.

☞ 2

# ఊహలు-అభిప్రాయాలూ

భద్రత కోసం మనం ఊహలను, అభిప్రాయాలను కూడా ఆశ్రయిస్తూ వుంటాం. కాదూ? ఈ ఊహలు ఏవిధంగా ఉత్పన్నమవుతాయో, మనసు వాటిని ఎట్లా అంటిపెట్టుకొని వుంటుందో మీరెప్పుడయినా గమనించారా? మీరు షికారుకి వెళ్ళినప్పుడు చూసిన ఒక అందమైనదానిని గురించిన ఊహ ఒకటి మీలో ఉంటుంది. మీ మనసు ఆ ఊహ పైకే, ఆ స్మృతి వైపుకే మళ్ళీ మళ్ళీ పయనిస్తుంది. ఒక పుస్తకం చదివాక మీకు కలిగిన ఒక అభిప్రాయాన్ని మీరు పట్టుకొని వదలరు. ఇట్లా ఊహలు వుత్పన్నమవడం, అవి ఆంతరికమైన ఉపశాంతి, భద్రత ఇచ్చే సాధనాలుగ తయారవడం, వాటిని మనసు అంటిపెట్టుకొని వదల లేకపోవడం - ఇదంతా మీరు గమనించాలి.

ఈ ఊహలు, అభిప్రాయాలు అనేవి ఏమిటి అని మీరు ఎప్పుడయినా ఆలోచించారా? మీకు ఒక ఊహ కలిగి, నాకు మరో ఊహ కలిగి, ఇద్దరమూ ఎదుటివారి ఊహకంటే నా ఊహే గొప్పదని అనుకుంటాం. అట్లా పోరాటం మొదలవుతుంది. పోరాడతాం కదూ? నేను మిమ్మల్ని నా ఊహ గొప్పదని ఒప్పించాలని చూస్తాను. మీరు నన్ను ఒప్పించాలని ప్రయత్నిస్తారు. ఈ లోకం మొత్తం ఇటువంటి ఊహలు, అభిప్రాయాలు, వాటి మధ్యన గల ఘర్షణ ఆధారంగా నిర్మితమైంది. కొంచెం లోతుగా ఆలోచించినట్లయితే ఒక అభిప్రాయాన్ని వదలకుండా అంటిపెట్టుకొని వేలాడటంలో అర్థం లేదని మీకు తెలుస్తుంది. కాని, మీ అమ్మ, నాన్న, మీ అధ్యాపకులు,మీ అత్తయ్యలూ, మామయ్యలూ, ఇంకా ఇతర బంధువులూ తమ ఆలోచనలను ఎట్లా గట్టిగా పట్టుకొని కూర్చొని ఉంటారో మీరు గమనించారా?

*(పాఠశాల విద్యార్థులకు ఇచ్చిన ప్రసంగంలో భాగం 'ముందున్న జీవితం" -అధ్యాయం-6)*

# (గతసంచిక తరువాయి) సమాధానం సమస్యలోపలే ఉంటుంది

కాబట్టి ఏరంగంలో, ఏ కార్యకలాపంలో మునిగితేలుతున్నా మీ స్వార్థాన్ని, మీ ప్రాముఖ్యతను, మీ ప్రతిష్ఠను, మీ భద్రతను గట్టిచేసుకుంటుంటారు. అందువల్ల స్వార్థాన్ని మర్చిపోవడానికి ఒకే ఒక మార్గం మిగిలింది. అదే సెక్సు. అందుకని ఆ స్త్రీకాని, ఆ పురుషుడు కాని మీకు చాలా ముఖ్యం అవుతారు. అందుకని వారిని మీరు స్వంతం చేసుకొని తీరాలి. కాబట్టి యీ స్వంతం చేసుకోవడాన్ని అమలులో పెట్టి, స్వాధీనంలో వుంచుకునే భరోసాను సమకూర్చే సమాజాన్ని మీరు నిర్మించుకుంటారు. తక్కిన అన్నింటిలోనూ 'నేనుకే ప్రాధాన్యం; సహజంగానే సెక్స్ చాలా ముఖ్యమైన సమస్య అయి కూర్చుంటుంది. సర్! యిటువంటి స్థితిలో పరస్పర వైరుధ్యాలు లేకుండా, బాధ లేకుండా, నిస్పృహ లేకుండా జీవించడం సాధ్యం అని మీరనుకుంటున్నారా? అయితే మతంలో కాని, సామాజిక కార్యకలాపాల్లో కాని నిజంగానే, చిత్తశుద్ధిగా స్వార్థచింతన లేనప్పుడు సెక్స్‌కు యింత పెద్ద స్థానం వుండదు. రాజకీయాల్లో గాని సమాజంలో గాని, మత విషయాల్లో కాని, ఏ గొప్పా లేకుండా సామాన్యంగా వుండిపోవాలంటే మీకు భయం. కాబట్టి సెక్స్ ఒక సమస్య అవుతున్నది. ఈ విషయాలన్నింటిలోనూ మీరు కనుక తగ్గిపోయి వుండటానికి, సామాన్యులుగానే వుండటానికి ఒప్పుకుంటే, అప్పుడు సెక్స్ అసలు సమస్యే కాదని మీరు గ్రహిస్తారు.

ప్రేమ వున్నప్పుడు మాత్రమే సౌశీల్యం వుంటుంది. ప్రేమ వున్నప్పుడు సెక్స్ ఒక సమస్య అవదు. ప్రేమ లేకుండా బ్రహ్మచర్యం అనే ఆదర్శాన్ని సాధించాలనుకోవడం అసంబద్ధం. ఎందుకంటే ఆదర్శం నిజంకాదు. భ్రమ. మీరు ఏమిటో, అది నిజం. మీ మనసునీ, మీ మనసు చేసే పనులని మీరే అవగాహన చేసుకోక పోతే సెక్స్‌ని కూడా అర్థం చేసుకోలేరు. ఎందుకంటే సెక్స్ మనసుకి సంబంధించినది. సమస్య అంత చిన్నదేమీ కాదు. కొన్ని అలవాట్లను అభ్యాసం చేసుకోవడం వల్ల ఏ లాభమూ జరగదు. తోటి మనుష్యులతో, ఆస్తిపాస్తులతో, సిద్ధాంతాలతో మీకుండే సంబంధ బాంధవ్యాలను గురించి అపారమైన ఆలోచన, లోతైన పరిశోధన అవసరం. సర్! దీని అర్థం ఏమిటంటే మీరు మీ హృదయాన్ని, మీ మనసును అత్యంతమైన కఠిన పరిశీలనకి గురి చేయాలి. ఆ విధంగా మీలో ఒక సంపూర్ణ పరివర్తనాన్ని తీసుకొనిరావడం జరుగుతుంది. ప్రేమ అంటేనే పవిత్రమైనది. ప్రేమ వున్నప్పుడు అంటే మనసు సృష్టించిన పవిత్రత అనే ఒక వూహ కాకుండా, నిజమైన ప్రేమ వున్నప్పుడు యీ సెక్స్ ఒక సమస్య అవదు. దాని అసలైన అర్థం చాలా భిన్నంగా వుంటుంది.

*(ది కలెక్టెడ్ వర్క్స్ ఆఫ్ జె. కృష్ణమూర్తి; 5వ సంపుటి, 19 డిసెంబరు 1948, న్యూఢిల్లీ)*

■

(1వ పేజీ తరువాయి) . . .

# మన లోలోతుల్లో ఉన్న భయాలను తెలుసుకోగలమా?

మతగ్రంథాలు రక్షకునితో సహా పూర్వపు వారసత్వ సంపద మరెంత మాత్రం ముఖ్యమైనవి గావు. దీనితో ఒంటరిగా నిలవడం, పరీక్షించుకోవడం, అన్వేషించడం, ప్రశ్నించడం అన్నింటినీ సందేహించడం అనే వత్తిడికి లోనవుతాడు. వానితో మనసు స్పష్టమవుతుంది. అందుచేత మనసు ఎంతమాత్రం నిబద్ధమవదు. వక్రమార్గాన్ని అనుసరించదు. చిత్రహింసకు లోనవదు.

మనం ఎవరిమయినా సరయిన సమాధానాన్ని తెలుసుకోవడానికి ఒంటరిగా నిలిచి మనకు మనం అన్వేషింపగలమా? ఎంతో నిబద్ధమయిన మనసులలో, హృదయాలలో జరిగే అన్వేషణలో చేతన అంతశ్చేతనలు రెండింటిలోనూ పూర్తి స్వేచ్ఛతో ఉండగలమా?

మనసు భయాన్నుండి విడుదలవగలదా? జీవితంలో ప్రధాన విషయమిది. మనిషి మనసుకు అంటుకున్న భయాన్నుండి ఎప్పటికయినా స్వేచ్ఛ పొందగలడా? అస్పష్టంగా సైద్ధాంతికంగా గాక తనకున్న భౌతిక మానసిక భయాల గురించి, చేతనలోని భయాల గురించి, అలాగే రహస్యంగా దాగివున్న భయాల గురించి వాస్తవంగా తెలుసుకునేందుకు ఈ విషయంలోని కెళదాము. అది సాధ్యమా? భౌతిక భయాల గురించి తెలుసుకోవచ్చు. అది ఎంతో కొంత సులభమే. అయితే, అంతశ్చేతనకు సంబంధించిన లోతు పొరలలోని భయాల గురించి తాను తెలుసుకోగలడా?

భయం ఏ రూపంలో వున్నా మనసును చీకటిమయం చేస్తుంది. మనసును వక్రమార్గం పట్టిస్తుంది. గందరగోళాన్ని, మనోవైకల్యాన్ని తెస్తుంది. భయంలో స్పష్టత ఉండదు. భయానికుండే కారణాలను సిద్ధాంతీకరించడము, వాటిని చాలా జాగ్రత్తగా విశ్లేషించడము, బుద్ధి కుశలతతో దానిలోనికి వెళ్ళడము జరిగినా చివరికి యింకా భయ పడుతూనే ఉంటాడన్నది మన మనసులో ఉంచుకుందాం. అయితే, భయమనే ప్రశ్నలోనికి వెళ్ళగలిగినప్పుడు యదార్థంగా దానిగురించి ఎరుకలో ఉన్నప్పుడు బహుశా దానినుండి పూర్తి స్వేచ్ఛను పొందగలము.

'నాకు ప్రజాభిప్రాయమంటే భయం', ' నా ఉద్యోగం పోవచ్చు', నాభార్య నన్నొదిలి పోవచ్చు', 'నాకు ఒంటరిగా ఉన్నానన్న భయం', 'ప్రేమింపబడడం లేదన్న భయం', 'నాకు మరణభయం' – ఇవన్నీ చేతనలోని భయాలు, తాను శాశ్వతంగా చిక్కుకున్న ఉచ్చువంటి ఈ జీవితం అర్థంలేకుండా, విసుగ్గా ఉన్నదన్న భయం, విద్యావంతులవడంలోని విసుగు, ఒక ఆఫీసులోనో, ఫ్యాక్టరీలోనో జీవిత భత్యాన్నిసంపాదించుకోవడము, పిల్లలను కనడము, కొన్ని లైంగిక ఆటవిడుపులను సుఖించడము, తప్పని దుఃఖము మరణము – ఇదంతా భయాన్ని, చేతనకు సంబంధించిన భయాన్ని పుట్టిస్తుంది. ఈ భయాన్నంతటినీ ఎదుర్కొనగలడా. ఈ భయంలోనికి వెళ్తే ఎప్పటికీ భయపడడా? అదంతా ఒక ప్రక్కకు పెట్టి స్వేచ్ఛగా ఉండగలడా? వెళ్ళలేకపోతే నిరంతరం ఆందోళనా అపరాధభావన అనిశ్చయ స్థితుల్లో పెరుగుతూ హెచ్చింపబడుతూ వున్న సమస్యలతో జీవించక తప్పదు.

కాబట్టి భయమంటే ఏమిటి? భయమంటే ఏమిటో మనకు నిజంగా తెలుసా? అదిపోయిన తర్వాత మాత్రమే మనం తెలుసుకుంటామా? దీనిని కనుగొనడం ముఖ్యం. మనమెప్పుడయినా భయాన్ని నేరుగా తాకి చూస్తామా? మన మనసులెంత బాగా తర్ఫీదయి, ఎంతగా అలవాటు పడిపోయాయంటే – భయాన్నుండి ఎప్పుడూ తప్పించుకుని దూరంగా పారి పోతుంటాయి. దానితో మనం భయం అని పిలుస్తున్న దానిని సూటిగా తాకలేము. మీ భయాన్నొక్కసారి తీసుకుని సూటిగా చూడడం ఉపయోగ కరంగా ఉంటుంది. బహుశా అందులోకెళ్తూ భయాన్ని గురించి నేర్చుకోవచ్చు.

భయమంటే ఏమిటి? అది ఎలా కలుగుతుంది? భయం స్వరూప స్వభావాలేమిటి? ఉదాహరణకు మనమనుకున్నట్లు ఒకరికి ప్రజాభిప్రాయమంటే భయం. అందులో ఎన్నో విషయాలు – తన ఉద్యోగం పోగొట్టుకోవడం

వంటివెన్నో యిమిడి వున్నాయి. ఈ భయమెలా కలుగుతుంది? ఇది కాలంతో వస్తుందా? భయానికి కారణమేదో తెలుసుకుంటే భయం అంతమవుతుందా? విశ్లేషిస్తే, అన్వేషించి కారణాన్ని కనుగొంటే భయం కన్పించకుండా పోతుందా? దేనిగురించో నాకు భయం. చావుగురించి, ఎల్లుండి ఏమవతుందోనని, లేదా గతంగురించి భయం. ఈ భయాన్ని పోషించి కొనసాగనిస్తున్నదేది? తానేదో తప్పుచేసి ఉండొచ్చు. లేదా చెప్పగూడనిదేదో చెప్పి ఉండొచ్చు. అదంతా గతం లేదా ముమ్మందు ఏమవనున్నదోనన్న భయం – అనారోగ్యం, జబ్బు, తన ఉద్యోగం పోతుందేమో – అవన్నీ భవిష్యత్తుకు సంబంధించినవి. అంటే గతం తాలూకు భయం, భవిష్యత్తుగురించి భయం. గతపు భయమంటే యదార్థంగా జరిగిన దాని గురించి భయం. భవిష్యత్తు భయమంటే ఏదో జరగబోతుందేమో, ఏదో జరగడానికి అవకాశమున్నదేమోనన్న భయం.

గతపు భయాన్నిగాని, భవిష్యత్తుకోసం పడుతున్న భయాన్నిగానీ పోషించి కొనసాగనిస్తున్న దేమిటి? అది తప్పక ఆలోచనే. గతంలో ఏమి చేశాడో, ఒక ప్రత్యేకమైన వ్యాధి ఎలా బాధపెట్టిందో, భవిష్యత్తులో తిరిగి ఆ బాధ పునరావృత మవుతుందేమో అన్న ఆలోచన. భయం పోషింపబడుతున్నది జ్ఞాపకం వలన. దాని గురించిన ఆలోచన వలన గత బాధ గురించి లేదా సుఖం గురించి ఆలోచించడంలో దానిని ఆలోచన సాగనిచ్చి, కాపాడి పెంచుతుంది. భవిష్యత్తుకు సంబంధించిన సుఖం, బాధ ఆలోచన చేస్తున్న కార్యక్రమమే.

నేను చేసేసిన దేనిగురించో, దాని భవిష్యత్ పరిణామాల గురించో నాకు భయం. ఈ భయాన్ని ఆలోచనే పోషిస్తోంది. అది స్పష్టంగా ఉన్నది. కాబట్టి ఆలోచనంటే కాలం, మానసికంగా, గంటలు, నిముషాలుగా లెక్కిస్తున్న కాలానికి భిన్నంగా మానసిక కాలాన్ని ఆలోచన తీసుకువస్తుంది. (గంటల కాలాన్ని గురించి మనమిప్పుడు మాట్లాడడం లేదు)

కాలాన్ని నిన్న, ఈరోజు, రేపు అంటూ వుంచుతున్న ఆలోచన భయాన్ని పెంచుతుంది. వర్తమానానికి, భవిష్యత్తులో ఏదో జరగబోతున్నదన్నదానికి మధ్య అంతరాన్ని ఆలోచన కల్పిస్తుంది. ఆలోచన మానసిక కాలంద్వారా నిరంతరం భయాన్ని పెంచుతుంది. భయానికి మూలం ఆలోచన. దుఃఖానికి మూలం ఆలోచన. ఒప్పుకుంటున్నారా? ఆలోచన స్వభావాన్ని, అదెలా పనిచేస్తుందో, ఎలా నిర్వహిస్తుందో మొత్తం గత స్వరూపాన్ని, వర్తమానాన్ని, భవిష్యత్తును ఎలా తయారు చేస్తుందో మనం యదార్థంగా చూస్తున్నామా? విశ్లేషిస్తూ తద్వారా భయ కారణాలను తెలుసుకుంటూ సహాయ పడినప్పటికీ ఆలోచన భయం పోగొట్టలేనిదని చూస్తున్నామా? భయ కారణానికి ఆ భయాన్నంతం చేయడానికి మధ్యనున్న ఖాళీలో భయమనే చర్య వున్నది. ఇది హింసాపరుడయిన మనిషి 'అహింస' అనే భావజాలాన్ని కనుగొనడం వంటిది. నేను అహింసా పరుడినవుతాను' అంటాడు. అయితే ఈ మధ్యకాలంలో హింసాబీజాలను నాటుతూ ఉంటాడు. కాబట్టి మనం భయాన్నుండి స్వేచ్ఛ నొందడంకోసం ఇప్పుడు కాలాన్నుపయోగించుకుంటే భయాన్ని పరిష్కరించలేము. కాలమే ఆలోచన. ఆలోచనతో భయాన్ని పరిష్కరించలేము. ఎందుకంటే, భయాన్ని పెంచింది ఆలోచనే.

కాబట్టి చేయవలసిన దేమిటి? ఈ భయపు ఉచ్చులోనుండి బయటపడే ఆ దారి ఆలోచన గానప్పుడు తానేమి చేయాలి? దీనిని బహుస్పష్టంగా గ్రహించండి. మెదడుతో గాదు, మాటల్లోనూగాదు. ఒక వాదనగా మీరేకీభవించడానికో, ఏకీభవించకపోవడానికో గాదు. శ్రద్ధగల వ్యక్తిగా దీనిపట్ల మనకొక తీవ్రత వున్నట్లయితే భయమనే ప్రశ్నలోనికి లోతుల్లోనికి ప్రవేశించాలి. భయానికి బాధ్యత ఆలోచనదే. భయాన్ని, సుఖాన్ని రెండింటినీ ఆలోచన పెంచుతుంది. అపరిమితమయిన ఈ భయభావాన్ని ఆలోచన పెంచుతుందని, ఈ భయాన్ని పరిష్కరించడం ఆలోచనకు సాధ్యమవదని బహు స్పష్టంగా తాను చూసినప్పుడు తర్వాత వేయవలసిన అడుగేమిటి? ఈ ప్రశ్నను మీకు మీరే వేసుకుంటున్నారని, నా సమాధానంకోసం ఎదురుచూడరని ఆశిస్తాను. నా సమాధానంకోసం ఎదురుచూడకపోతున్నట్లయితే దీనిని ఎదుర్కోవడానికి మీరు నిలిచినట్లు మీకదొక సవాలు. దీనికి మీరిచ్చే సమాధానమేమిటో చెప్పాలి. ఈ సవాలుకు మీ పాత సమాధానాలిస్తే అప్పుడు మీరెక్కడ ఉన్నట్లు? మీరింకా భయపడుతూనే ఉన్నట్లు. ఈ సవాలు క్రొత్తది. తక్షణమే చర్య తీసుకోవలసినది. ఆలోచన భయాన్ని పెంచింది. ఆలోచన భయాన్నంతం చేసే అవకాశమే లేదు. మీరిప్పుడు ఏమి చేస్తారు?

ముందుగా, ఆలోచన స్వరూప స్వభావాలనర్థం చేసుకున్నాను అని చెప్పినప్పుడు దానర్థం ఏమిటి? 'నాకది అర్థమయింది', 'నేనది అర్థం చేసుకున్నాను'', 'ఆలోచన స్వభావాన్ని చూశాను' అన్నప్పుడు దాని అర్థమేమిటి? 'నేను అర్థం చేసుకున్నాను' అంటున్న మనసు స్థితి ఏమిటి?

దయచేసి జాగ్రత్తగా గ్రహించండి. దేనినీ బలవరచవద్దు. 'ఆలోచన అర్థం చేసుకుంటుందా? అని అడుగుతున్నాము. మీరేదో చెప్తారు. ఉదాహరణకు ఆధునిక జీవితపు సంక్లిష్టతలను బహు జాగ్రత్తగా సూక్ష్మంగా వర్ణిస్తారు. 'నాకు అర్థమయింది' అంటాను. కేవలం వర్ణన గాదు. దానిలోని విషయం లోతు. అందువలన దానిలో చిక్కుకున్న మనుషులు అధైర్యంగా, నాడీ సంబంధ మనోరుగ్మతతో ఎంతో భయంకర స్థితిలో ఉండడము – యిత్యాదివాటిని చూస్తాను. అనుభూతితో, నా నాడులతో, నా చెవులతో మొత్తంలో అవగాహన చేసుకుంటాను. కాబట్టి దానితో యివెంత మాత్రమూ చిక్కుకుపోయి ఉండవు. నేనెప్పుడు త్రాచుపాము అపాయకరమని గ్రహిస్తానో, అంతే దాని దరికిగూడా పోను. అది నాకు ఎదురయినప్పుడు నా చర్య వేరుగా వుంటుంది. ఎందుకంటే, సంగతి నాకర్థమయింది కాబట్టి. అందుచేత, ఆలోచన స్వభావాన్ని, ఆలోచనా ఫలితమయిన భయాన్ని, సుఖాన్ని అర్థం చేసుకునే స్థితిలో తానున్నాడా? దానిని తన అధీనంలోనికి తెచ్చుకుంటున్నాడా? అదెలా పనిచేస్తుందో చూశాడా? సైద్ధాంతికంగానో మాటలలోనో, బుద్ధితోనో గాక యదార్థంగా ఎలా పనిచేస్తుందో చూశాడా? లేదా నేనింకా వర్ణనతోనే, వాదనతోనే, తార్కికక్రమంలోనే ఉంటూ వాస్తవతతో లేనా? కేవలం వర్ణనతో, మాటల వివరణతోనే సరిపెట్టుకుంటుంటే నేను వాటిచుట్టూ తిరుగుతూ ఆడుకుంటున్నట్లు. వర్ణన సూటిగా వర్ణింపబడేదానినే చూడనిస్తే అప్పుడక్కడ పూర్తిగా భిన్నమైన చర్య ఉంటుంది. ఆకలితో వున్న మనిషి ఆహారం కావాలనుకున్నట్లు. ఆహారపు వర్ణన గాదు. తింటే ఏమవుతుందో తెల్పి చెప్పడమూ గాదు. అతనికి కావలసింది ఆహారం.

ఆలోచన భయాన్నెలా పెంచుతుందో చూసినప్పుడు ఏమవుతుంది? తనకు ఆకలి

## తెరవండి కిటికీలూ తలుపులూ

**జీవితం ఎల్లవేళలా మన తలుపులు తడుతూనే వుంటుంది. జీవిత వైశాల్యాన్ని మనకు చూపాలని మూసివున్న మన కిటికీలను నెడుతూనే వుంటుంది. మనం భయంతో తలుపులకు తాళాలు వేసుకుంటే, కిటికీల గొళ్ళేలు బిగిస్తే తట్టడం ఇంకా బిగ్గరగా ఇంకా ఎక్కువగా అవుతుంది.**

వేసినప్పుడు ఆహారమెంత బాగుంటుందో ఎవరయినా వర్ణిస్తుంటే తానేమి చేస్తాడు. తన స్పందన ఎలా ఉంటుంది? 'ఆహారాన్ని వర్ణించొద్దు. నా కివ్వు' అంటాడు. అక్కడ సూటి చర్య వుంటుందిగాని సిద్ధాంత భావనగాదు. కాబట్టి 'నాకర్థమయింది' అన్నప్పుడు దానర్థం ఆలోచన, భయం, సంతోషాలగురించి నేర్చుకోవడమనే నిరంతర చలన ముంటుందని. భయాన్ని గురించి అలా నేర్చుకున్నప్పుడు భయమంతమవుతుంది.

ముసుగును ఎప్పుడూ తొలగించని భయాలు మనసులో దాగి, రహస్యంగా ఉన్నాయి. సచేతన మనసు వాటి ముసుగు నెలా తొలగిస్తుంది? చేతనా స్థాయిలోని మనసు కలలద్వారా ఆ భయాల సూచనలను అందుకుంటుంది. ఈ కలలు తన కొచ్చినప్పుడు వాటిని వ్యాఖ్యానించాలా? తనకు తాను వాటి అర్థాన్ని సులభంగా గ్రహించలేనప్పుడు వెలుపలి నుండి వ్యాఖ్యాతగావలసి వుంటుంది. అయితే ఆయన తన ప్రత్యేక పద్ధతిలో నిపుణతతో వ్యాఖ్యానించవచ్చు. మరికొన్ని కలలుంటాయి. కలలు కంటూ వున్నప్పుడే వ్యాఖ్యానించడమూ జరుగుతుంది.

అసలు తానెందుకు కలలు గనాలి? 'కలలు గనాలి' లేకుంటే పిచ్చి పడుతుందంటారు' నిపుణులు. కాని తప్పక కలలు గనాలి అని నేననుకోను. పగటి సమయంలో అంతశ్చేతన యిచ్చే సూచనలకు, సంకేతాలకు సావధానంగా ఉంటే కలలుగనరు. కలగనడమనే యీ నిరంతర పోరాటం నిద్రలో వుంటే మనసెంత మాత్రం నిశ్చలమవదు, విశ్రమించదు, పునరుజ్జీవించదు. పగటిపూట మనసు అంత స్పష్టంగా, అంత చురుగ్గా జాగృతమయి, ఎరుకతో ఉండగల్గితే దాగివున్న భయాలు, సూచనలు, సంకేతాలు వెల్లడయి పరిశీలనకు లోనయి కరిగిపోవా?

మాటలో, చర్యలో జరిగే ప్రతి దానిలో పగటి సమయాన ఉండే ఎరుకవలన, సావధానతవలన దాగివున్న భయాలు, బాహ్యంగా వున్న భయాలు, రెండూ వెల్లడవుతాయి. అప్పుడు నిద్రిస్తే ఒక్క కల కూడా లేని పూర్తిగా ప్రశాంతమైన నిద్ర సంభవమవుతుంది. తరువాత ఉదయానికి తాజాగా, లేతగా అమాయకంగా, సజీవంగా మనసు మేల్కొంటుంది. ఇది సిద్ధాంతంగాదు, మీరిది చేయండి. మీరే తెలుసుకుంటారు.

**ప్రాశ్నికుడు: దాగివున్న భయాలను చేతనాస్థాయిలోనికి తీసుకురావడమెలా సాధ్యపడుతుంది?**

**కృ:** తాను చురుగ్గా, వేగంగా గమనికలో వుంటే గత భండారము జాతి సంక్రమణము వంటి వాటికి నెలవై ఉన్న తనలోని అంతశ్చేతనను పరిశీలింపగలడు. నేను పుట్టింది భారతదేశంలో, పెరిగింది, అన్ని పాక్షిక ధోరణులు, మూఢనమ్మకాలు, నిర్దిష్టమయిన నైతిక జీవనము యిత్యాదివాటితో నున్న ఒక బ్రాహ్మణ తరగతిలో – వాటితో పాటు జాతిపరము, కుటుంబపరము అయిన విషయాలు పదివేల సంవత్సరాలు, యింకా పైగా వున్న సామూహిక వ్యక్తిగత సంప్రదాయాలు, ఇదంతా అక్కడ అంతశ్చేతనలో ఉన్నది. అంతశ్చేతనంటే సాధారణంగా మనమనుకునేదంతా. దానికి నిపుణులు మరొక అర్థాన్నీయవచ్చు. సాధారణ మానవులమయిన మనము మనకు మనమే పరిశీలించగలము. ఇదంతా వెల్లడించేదెలా? ఇది మీరెలా చేస్తారు? మీలో అంతశ్చేతన ఉన్నది. మీరు యూదులయితే దాగివున్న యూదు మత సంప్రదాయమంతా ఉంటుంది. మీరు కాథలిక్కు అయితే అదంతా వుంటుంది. మీరు కమ్యూనిస్టు అయితే మరొకరకంగా ఉంటుందక్కడ. కలలు గనకుండా దానినంతా బయటికెలా తీసుకువస్తారు? ఇదేమీ చిక్కుసమస్యగాదు.

పగటి పూట మీరు చురుగ్గా వుంటే ఆలోచన కదలిక మొత్తాన్నిగురించి మీరేమి చెప్తున్నారో, మీ భావసూచికలేమిటో, ఎలా కూర్చుంటారో, ఎలానడుస్తారో, ఎలా మాట్లాడుతారోనన్న వాటిగురించి ఎరుక వుంటే, మీ స్పందనలగురించి ఎరుకవుంటే దాగివున్నవన్నీ బహుసులభంగా బయటికొస్తాయి. సమయం తీసుకోదు. ఎక్కువ రోజులందుకు పట్టదు. ఎందుకంటే, మీరేమాత్రం ప్రతిఘటించడం లేదు. పనిగట్టుకుని లోనికి చొచ్చుకుంటూ పోవడం లేదు. ఊరక పరిశీలిస్తున్నారు, వింటున్నారు. ఎరుకగల ఆ స్థితిలో ప్రతి ఒక్కటీ వెల్లడవుతుంది. కాని 'నేను కొన్ని ఉంచుకుంటాను. మిగిలినవాటిని వదిలేస్తాను' అంటే మీరు సగం నిద్రలో ఉన్నట్లు. హిందూమతంలోనో, యూదుమతంలోనో, కాథలిక్కుమతంలోనో ఉన్న మంచినంతా నేను ఉంచుకుంటాను. మిగిలినదంతా పోనిస్తాను. అంటే మీరింకా నిబద్ధతనే పట్టుకుని ఉన్నారన్నది రూఢి అవుతుంది. కాబట్టి దీనినంతా ఎటువంటి ప్రతిఘటనా లేకుండా బయటకు రానివ్వాలి.

**ప్రా: ఆ ఎరుక ఎంపిక లేకుండా ఉండాలా?**

**కృ:** ఎంచుకుంటుంటే ఎరుకను అడ్డుకుంటున్నట్లు. ఎంపిక లేకుండా ఆ ఎరుక వుంటే ఎంతో దాగి, రహస్యంగా వున్న కోరికలు, భయాలు వత్తిడులు ఉన్నవన్నీ వెల్లడవుతాయి.

**ప్రా: రోజుకో గంటసేపు ఎరుకతో ఉండడానికి ప్రయత్నం చేయాలా?**

**కృ:** ఒక్కనిముషంపాటు నేను ఎరుకతో సావధానంగా వుంటే చాలు. మనలో చాలా మందిమి సావధానంగా ఉండము. సావధానంగా లేము అన్న ఎరుకే సావధానత. అంతేగాని, సావధానత్వం పెంచుకోవడము సావధానత కాదు. నాలో జరుగుతున్న మొత్తాన్ని ఎంపిక లేకుండా, బహు స్పష్టంగా పరిశీలిస్తూ ఒకే ఒక్క నిముషంపాటు ఎరుకతో వుంటే ఒక గంటపాటు సావధానత లేకుండా గడుపుతాను. ఆ గంట గడిచిన తర్వాత తిరిగి సావధానమవుతాను.

*(అమెరికాలో బ్రాండీస్ విశ్వవిద్యాలయంలో చేసిన రెండవ ప్రసంగం -'నీవే ప్రపంచం' నుండి)*

■

# చూడటం ఒక కళ

**ఈ ఉదయం ఆకాశంలో ఒక్క మబ్బు కూడా లేదు. సూర్యుడు లోయలోకి ప్రసరిస్తున్నాడు. సమస్తలోకమూ ఉల్లాసంతో ప్రఫుల్లమైంది. మానవుడు తప్ప. ఈ అద్భుతమైన ధరిత్రి వైపు ఒకసారి పరికించి మళ్లీ తన అవస్థల్లో, తన దుఃఖంలో, తన క్షణిక సుఖాల్లో పడిపోయాడు మనిషి. చూడటానికి అతడికి సమయం లేదు. అతడి సమస్యలూ, అతడి వ్యథలూ, అతడి హింసాత్మకతా అతడిని పూర్తిగా ఆక్రమించుకొని వున్నాయి. చెట్టుని అతడు చూడటం లేదు. అందుచేత తను పడుతున్న అవస్థలనూ అతడు చూడటం లేదు.**

**బలవంతంగా అతడికి చూపుతే, చూసినదానిని ముక్కలు ముక్కలుగా చీరి చూస్తాడు. ఇదంతా విశ్లేషణ అంటాడు. దీని నుంచి తప్పించుకుపోవాలని చూస్తాడు. లేదా అంటే అసలు చూడటానికే ఇష్టపడడు. ఈ చూసే కళలోనే పరివర్తన అనే పరమాద్భుతం వుంటుంది. అదే ' ఉన్నది' యొక్క పరివర్తన. 'ఉండవలసినది' లేనే లేదు. అది ఏనాడూ వుండదు. చూడటం అనే చర్యలో మనకు తెలియని అపారమైన రహస్యం వున్నది. దీనికి శ్రద్ధ, సావధానత అవసరం. ప్రేమ అంటే అదే.**

*(కృష్ణమూర్తిస్ జర్నల్ - 10 ఏప్రిల్ 1975)*

# నైతికత

**ఒకరి ప్రశ్న: సత్‌గుణాలు అంటే ఏమిటి?** సరియైన క్రియ, అంటే సత్‌క్రియే చేయాలంటే మనకి తోడ్పడేది ఏది? నీతికి వేసుకోవలసిన పునాది ఏమిటి? ఊరికే తర్జన భర్జనల్లో పడకుండా ఏది మంచి అనేది ఎట్లా కనిపెట్టాలి? అదేనా అసలు మన గమ్యం?

**కృష్ణమూర్తి:** సామాజిక నీతి సూత్రాలను పక్కకు నెట్టి పారేద్దామా? ఎందుకంటే నిజంగా చూస్తే దుర్నీతి అదే. సామాజిక నీతి పరువు మర్యాదలను సంపాదించుకున్నది. మతం కూడా దీనికి ఆమోదం తెలిపి హర్షిస్తున్నది. ఇక దీని మీద ధ్వజమెత్తిన తిరుగుబాటు కూడా కొంత కాలానికి అంతే నీతి బాహ్యంగా, చిరకాలంగా పాతుకొని పోయిన ఈ సామాజిక నీతి లాగే తయారవుతుంది. ఈ నీతి యుద్ధాలు చేయమనీ, చంపమనీ, దౌర్జన్యం చేయమనీ, అధికారబలం సంపాదించమనీ, ద్వేషానికీ స్థానం ఉన్నదనీ ఉంటుంది. ఇదంతా బాగా పాతుకొనిపోయిన అధికార ఆధిపత్యాలు చలాయిస్తున్న క్రూరత్వమూ, అన్యాయమూ. ఇది నీతి కాదు. కానీ మనం నిజంగా ఇదంతా నీతికాదు అని అనగలుగుతున్నామా? ఎందుకంటే మనలో ఆ స్పృహ ఉన్నా లేకపోయినా మనం కూడా ఈ సమాజంలోని వారమే. సామాజిక నైతికతే మన నైతికత. దీనిని అంత సులువుగా పక్కకి నెట్టేయగలమా? దీనిని మనం ఎంత సునాయాసంగా చేయగలిగితే మన నీతిపరత్వాన్ని అది అంతగా సూచిస్తుంది. అంతే తప్ప, మనం ఎంత ప్రయాస పడ్డామో, దీని వలన ఎంత నష్టపోయామో, ఏ ప్రతిఫలం పొందామో, ఏ శిక్షకు గురికావలసివచ్చిందో అవి కాదు – ఎంత అనాయాసమైన సులువుతో సామాజిక నీతిని విసర్జిస్తామో అదీ మన నైతికతను సూచిస్తుంది. మన ప్రవర్తనను మనం నివసిస్తున్న పరిసరాలు నిర్దేశిస్తుంటే కనుక, అదుపులో పెట్టి మలుస్తూ వుంటే కనుక అప్పుడా ప్రవర్తన యాంత్రికమూ, విపరీతమైన నిబద్ధతకు లోనైనదీ అని అర్థం. నిబద్ధతకు కట్టుబడి మనం ప్రతిస్పందిస్తూ వుంటే అప్పుడు మన ప్రవర్తన నీతి మంతమా? మీ చర్యలు భయం మీద, ప్రతిఫలాల మీద ఆధారపడి చేస్తుంటే కనుక అప్పుడవి సత్క్రియలవుతాయా? ఆదర్శాలకో, సిద్ధాంత వాదాలకో అనుగుణంగా వుండే ప్రవర్తన మీరు అలవరచుకుంటే అవి సద్గుణాలవుతాయా?

అందుచేత, ఆధిపత్యాలు, అనుకరణ, లొంగుబాటు, విధేయత అనేటటువంటి ఈ నీతులన్నింటినీ మనం ఎంత ప్రగాఢమైన లోతులలో నుండి విసర్జించామనేది తెలుసుకొని తీరాలి. మన నైతికత అంతా భయం మీదే కదూ ఆధారపడి వున్నది. ఈ ప్రశ్నలన్నింటికీ ముందుగా మనమే సమాధానాలు కనిపెట్టనంతవరకు నిజమైన సద్గుణశీలత అంటే ఏమిటో మనం తెలుసుకోలేము. మేము ముందే చెప్పినట్లుగా ఈ బూటకంలో నుండి ఎంత తేలికగా బయటపడగలం అనేది అత్యంత ప్రధానమైన సంగతి. ఆ బూటక నీతిని ఉపేక్షించినంత మాత్రాన మీలో నీతిపరత్వం ఉన్నట్లు అవదు. అది ఒక రకమైన మానసిక జాడ్యాన్ని సూచిస్తుంది, అంతే. ప్రతిరోజూ ఒకే రకమైన పనులతో గాడిలో పడిన జీవితం గడుపుతూ, ఎంతో తృప్తిగా జీవిస్తుంటే అదీ నీతి వర్తన అవదు. మహాత్ములవాలంటే దారి ఇదీ అని సంప్రదాయం స్థిరీకరించిన పద్ధతికి తలవొగ్గి అనుసరించే మహాపురుషుల నైతికత కూడా నీతివర్తన కాదని స్పష్టంగా చెప్పవచ్చు. అందుచేత ఏ విధానమూ, పద్ధతీ అయినా సరే, అది సంప్రదాయబద్ధమైనా, సంప్రదాయ విరుద్ధమైనా దానికి తలవొగ్గి అనుసరించడం సత్ప్రవర్తన కానే కాదు. స్వేచ్ఛలో మాత్రమే సద్గుణాలు కలిగివుండటం సాధ్యం.

నీతిపరత్వం అని అందరూ అంటున్న ఈ జాలంలో నుండి మిక్కిలి ప్రజ్ఞావంతంగా, నైపుణ్యంతో బయటపడలేమా? స్వేచ్ఛగా ఉన్నప్పుడే క్రియలో నైపుణ్యం ఉంటుంది. సత్‌గుణమూ ఉంటుంది.

**ప్రశ్నిస్తున్నవారు:** ఈ నైపుణ్యం అనే ప్రజ్ఞనుపయోగించి ఏ భయమూ లేకుండా సామాజిక నీతి పరత్వంలో నుండి బయటపడగలనా? సమాజం నన్ను అవినీతిపరుడు అని అంటుందేమో అనే ఊహే నన్ను భయభీతిలో ముంచెత్తుతున్నది. యువకులు ఇది చేయగలరు. కాని నేను మధ్యవయస్కుడిని. నాకు ఓ కుటుంబం ఉన్నది. పరువుమర్యాదలు అనే ఈ మధ్యతరగతి బూర్జువా గుణం నా రక్తంలో జీర్ణించుకొని పోయి ఉన్నది. అది అట్లా ఉన్నది. అందుకని నాలో ఇంతటి భయం.

**కృష్ణమూర్తి:** సామాజిక నీతిని ఆమోదించనైనా ఆమోదించండి. లేదా నిరాకరించండి. అంతేకాని రెండూ కావాలంటే కుదరదు. ఒక పాదం నరకంలో ఇంకొక పాదం స్వర్గంలో పెట్టి నడవలేరు.

**ప్రశ్నిస్తున్నవారు: అయితే నేనేం చేయాలి?** నైతికత అంటే ఏమిటో ఇప్పుడు నేను చూడగలుగుతున్నాను. అయినా అవినీతిలోనే నిరంతరం మునిగి తేలుతున్నాను. వయసు పైబడుతున్న కొద్దీ ఇంకా కృతకంగా, బూటకంగా తయారవుతున్నాను. ఈ సామాజిక నీతి నాకు పరమరోత కలిగిస్తున్నది. అయినా దాని వలన కలిగే లాభాలు కావాలి, ఆ సౌకర్యాలు, భౌతికంగానూ మానసికంగానూ లభించే ఆ భద్రతా, ఒక ఫలానా మంచి చోట నివసిస్తున్న గుర్తింపూ కావాలి. ఇదీ నా వాస్తవ స్థితి. ఖండించవలసిన దారుణస్థితి. నేను ఏం చేయాలి?

**కృష్ణమూర్తి:** ఇట్లాగే బ్రతుకుతూ ఉండటం తప్ప ఇంకేమీ చేయలేరు. నీతి మంతంగా ఉండాలనే ప్రయత్నమూ, సద్గుణాలను గురించి ఊరికే విచారించడమూ మానేయడం ఇంతకంటె నయం.

**ప్రశ్నిస్తున్నవారు:** కానీ నేను అట్లా ఉండలేనే. నాకు ఆ మరొకటి కావాలి! అందులోని సౌందర్యమూ, ప్రాణశక్తీ–ఆ స్వచ్ఛతా, వినిర్మలతా నాకు తెలుస్తున్నాయి. నేను పట్టుకొని కూర్చున్నదానిలో మురికీ, వికృతత్వమూ కనబడుతున్నాయి. అయినా దీనిని వదిలిపెట్టలేకపోతున్నాను.

**కృష్ణమూర్తి:** అప్పుడు సమస్యే లేదు. సద్గుణాలూ పరువుమర్యాదలూ రెండూ కావాలంటే కుదరదు. సద్గుణమే విముక్తి–స్వేచ్ఛ. స్వేచ్ఛ ఒక ఊహకాదు. ఒక భావన కాదు. ఒక ప్రతిపాదన కాదు. స్వేచ్ఛతో ఉన్నప్పుడు సావధానశీలత ఉంటుంది. ఈ సావధానతలో మాత్రమే మంచితనం వికసిస్తుంది.

*('దిఅర్జెన్సీ ఆఫ్ ఛేంజ్, నుండి)*

## కె బోధలపై జాతీయ సదస్సు

**శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం (తిరుపతి)లోని ఫిలాసఫీ శాఖవారు 'జిడ్డు కృష్ణమూర్తి తత్త్వం - మానవాళి భవితవ్యం' అనే అంశంపైన జాతీయ సదస్సును నిర్వహించారు. డా. జి. వేదపారాయణగారి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశాలలో 16 విశ్వవిద్యాలయాల ప్రతినిధులు పాల్గొని పత్రాలు సమర్పించారు. కృష్ణమూర్తి ఫౌండేషన్ ఇండియా వారు, కొన్ని కృష్ణమూర్తి స్టడీ సెంటర్ల నుండి సభ్యులు కూడా పాల్గొన్నారు. కె బోధనలలోని వివిధాంశాలను పత్రసమర్పకులు తమ 24 ప్రసంగ వ్యాసాలలో స్పృశించి వివరించారు. ప్రశ్నలు - సమాధానాలకు కూడా కొంత సమయం కేటాయించబడింది. కృష్ణమూర్తి ప్రసంగాల విడియోలు ప్రదర్శించగా పలువురు తిలకించారు.**

# మనస్సు పనిచేసే తీరుతెన్నులు

మనస్సు అంటే ఏమిటి? అంటే నా అర్థం, నరాలకు సంబంధించిన రకరకాల స్పందనల ద్వారా ప్రతిచర్య చూపే భౌతిక జీవాంగం అయిన మెదడు అని మాత్రం కాదు. దీనిని గురించి ఏ జీవతత్త్వశాస్త్రవేత్త అయినా చెప్పగలడు. అది కాదు. మనం ఇప్పుడు తెలుసుకోబోయేది మనస్సు అంటే ఏమిటి అనేది. 'నేను ఆలోచిస్తాను', 'ఇది నాది', 'నాకు నొప్పి కలిగింది', 'నాకు అసూయ', 'నేను ప్రేమిస్తున్నాను', 'నేను ద్వేషిస్తున్నాను', 'నేను భారతీయుడిని', 'నేను ముస్లిముని', 'నేను ఇది నమ్ముతున్నాను', 'నాకు అందులో నమ్మకం లేదు', 'నాకు తెలుసు', 'మీకు తెలియదు', 'నేను గౌరవిస్తాను', 'నేను అసహ్యించుకుంటాను', 'నాకు కావాలి' అని అంటూవుండే మనస్సు. ఇది అసలు ఏమిటి? మీరు ఇప్పుడే కనుక మనస్సు అని మనం అనే ఈ ఆలోచనా ప్రక్రియను అంతా అవగాహన చేసుకొని, దానిని క్షుణ్ణంగా, సన్నిహితంగా తెలుసుకొనడం ఆరంభించకపోతే, దానిని గురించి మీ లోపల మీరు పూర్తిగా ఎరుకతో ఉండకపోతే, పెద్దవారవుతున్న కొద్దీ మీరు క్రమక్రమంగా కఠినమైపోయి, కరడుగట్టుకొని పోయి, మందకొడిగా తయారై, ఒక మాదిరి అయిన ఆలోచనా విధానంలో స్థిరపడిపోతారు.

మనస్సు అని మనం పేరు పెట్టిన ఈ పదార్థం ఏమిటి? అది మన ఆలోచనల తీరు; అవును కదూ? నేను మాట్లాడుతున్నది మీ అందరి మనస్సు గురించి మరెవరి మనస్సు గురించో కాదు. మీరు ఎట్లా ఆలోచిస్తుంటారు, ఎట్లా భావిస్తారు, చెట్లవైపు, చేపలు పట్టేవారి వైపు ఏ రకమైన దృష్టితో చూస్తారు, ఒక పల్లెమనిషిని ఏవిధంగ పరిగణిస్తారు అనేవి. మీరు పెరిగి పెద్దవారవుతున్న కొద్దీ మీ మనస్సు క్రమక్రమంగా వంకరటింకరగా అవడమో, ఒక మాదిరి అయిన విధానంలో స్థిరపడి పోవడమో చేస్తుంది. మీకు ఒకటి కావాలని కోరుకుంటారు. దాని కోసం ఆరాటపడతారు. మీరు మీరుగా కాకుండా మరొకలాగా ఉండాలని, మరొకటి అవాలని కోరుకుంటారు. ఈ కోరిక ఒక నమూనాను తయారు చేస్తుంది. అంటే మీ మనస్సు ఒక నమూనాను తయారుచేసి, అందులో తను చిక్కుకు పోతుంది. మీ కోరిక మీ మనస్సును ఘనీభవింపజేస్తుంది, కరడుగట్టిస్తుంది.

*(పాఠశాల విద్యార్థులకు ఇచ్చిన ప్రసంగంలో భాగం - 'ముందున్న జీవితం-9వ అధ్యాయం)*

## "ధ్యానం" పునర్ముద్రణ

అదనంగా చేర్చిన మరొక
60 పుటలతో సరిక్రొత్త "ధ్యానం"
సంపుటం వెలువడింది.
కవరుపై **కృష్ణమూర్తి** చిత్రంతో
జనవరిలో విడుదలైన ఈ పుస్తకం ధర
రు. 50/-. అనువాదం చేసినది
పి. సదాశివరావు, సరోజినీ
ప్రేమ్‌చంద్. వసంతవిహార్ (చెన్నై)
లోనూ, విశాలాంధ్ర వారి పుస్తక
విక్రయశాలలలోను ప్రతులు
లభ్యమవుతాయి.
"ధ్యానంలో ధ్యాని ఉండరు.
ధ్యానిస్తున్న ఒకరు ఉంటే కనుక అది
ధ్యానం కాదు." (113 పుట)

**వినతి**

'అంతరంగ యాత్ర' మీ మిత్రులు, సన్నిహితులు కూడా చదువుతే బాగుంటుంది అని అనిపిస్తే, వారి చిరునామాలు మాకు పంపండి. ఉచితంగా పత్రిక పంపుతాము.


**Statement about ownership and other particulars of Antharanga Yatra**

**FORM-IV**

| | | |
|---|---|---|
| 1. Place of publication | : | Krishnamurti Foundation India<br>Vasanta Vihar,<br>124, 126 Greenways Road<br>Chennai - 600 028. |
| 2. Periodicity of publication | : | Once in four months<br>(August, December & April) |
| 3. Printer's Name | : | N. Subramanian |
| Whether Citizen of India | : | Yes |
| Address | : | Sudarsan Graphics Offset Press<br>27, Neelakanta Metha Street<br>T. Nagar<br>Chennai - 600 017. |
| 4. Publishers Name | : | G. Rajeev |
| Whether citizen of India | : | Yes |
| Address | : | Krishnamurti Foundation India<br>Vasanta Vihar<br>124,126 Greenways Road<br>Chennai - 600 028. |
| 5. Editors Name | : | K. Krishnamurthy |
| Address | : | Krishnamurti Foundation India<br>Vasanta Vihar<br>124, 126 Greenways Road<br>Chennai - 600 028 |
| 6. Name and address of the individuals who own the newspaper and partners of shareholders holding more than one percent of the total capital. | : | Krishnamurti Foundation India<br>Vasanta Vihar<br>124, 126 Greenways Road<br>Chennai - 600 028 |

I, G. Rajeev hereby declare that the particulars given are true to the best of my knowledge and belief.

Sd.
(G. Rajeev)

*Published in August, December & April*
*Registered with The Registrar of Newspapers for India under No. TNTEL/2006/19442*

Periodical

*If undeliverd please return to:*
KRISHNAMURTI FOUNDATION INDIA
Vasanta Vihar, 124, 126 (Old No. 64, 65) Greenways Road
Chennai - 600 028. Tel: 24937803/24937596
E-mail: publications@kfionline.org
Websites: www.kfionline.org/www.jkrishnamurti.org

*Published by G. Rajeev on behalf of the Krishnamurti Foundation India, Vasanta Vihar, 124, 126 (Old No. 64, 65)Greenways Road, Chennai - 600 028. Printed by N. Subramanian at Sudarsan Graphics Offset Press, 27 Neelakanta Mehta Street, T. Nagar, Chennai - 600 017. Editor : K. Krishnamurthy*